# సుందర స్వప్నం

రెండు నెలలుగా హడావిడి పడుతున్న విషయం ఒక కొలిక్కి వచ్చింది. సుందరి గుండెలు ఆనందంతో ఎగిరిపడ్డాయి. చిన్నకూతురు మల్లికకు అమెరికా సంబంధం ఖాయమైనప్పుడే తన కల నిజమైనట్టు ఆనందం కలిగింది.

అమెరికాలో ఉన్న అబ్బాయికి అమ్మాయినిస్తే పురుడు పొయ్యడానికి తప్పకుండా ఆ తల్లికి అమెరికా వెళ్ళే ఛాన్సు వస్తుందని బంధువులు, మిత్రులు మాట్లాడుకోవడాన్ని బట్టి అర్థమైంది. ఆడపడుచు కూతురు పద్మలతని అమెరికా యిచ్చినప్పుడు పైకి బాగా మాట్లాడిన లోలోపల చాలా ఆరాటపడిపోయింది. మల్లికకి అమెరికా సంబంధం కాదనటానికి వీల్లేకుండా తయారుచేసింది. తర్ఫీదిచ్చింది. అది ఫలించింది.

మల్లికకు నెల తప్పిందనే వార్త వచ్చినప్పటి నుంచీ సుందరి బట్టలు సర్దుకోవటము మొదలు పెట్టింది. ఎండ చూసుకుని వడియాలు పెట్టింది. అదను చూసుకుని అప్పడాలు (కొన్నవి అల్లుడిష్టపడడు) పదును చూసుకుని పచ్చళ్ళూ, వీలు చూసుకుని పొళ్ళు తయారుచేసుకుని సిద్ధపడిపోయింది.

కూతురి బెడ్ రెస్ట్ టైంలో వియ్యపురాలు విమానం ఎక్కేసిందని తెలిసి విస్తుపోయింది.

అయితే మల్లిక ఫోన్ చేసి "అమ్మా! నువ్వు పురుటి సమయంలోనూ, ఆ తర్వాత వుంటే బాగుంటుందే" అని గారాలు పోయింది.

నిజమే మరి బాలింతకు శ్రద్ధగా అన్నీ చూసుకోవచ్చు. చంటిపాపతో ముచ్చటగా వుంటుంది. ముద్దులు, మురిపాలు చూడవచ్చు అని సంబరపడి సరేనంది.

కాలం గిర్రున తిరిగింది. మల్లికకు ఎనిమిదో నెల దాటిపోయింది. వియ్యపురాలు ఇండియా వచ్చేసి నెల దాటిపోయింది. పాస్‌పోర్టుల వీసాల తతంగం ముగిసి టిక్కెట్టు వచ్చేసింది. అదే రోజు ఇక్కడ్నించి వెళ్ళే తెలుసున్న తెలుగువాళ్ళతో బయలుదేరేలా నిర్ణయమైపోయింది.

ప్రయాణం రెండు రోజలుండనగా పనిచేసి చేసి సుందరి ఒళ్ళు బాగాపులిసి పోయింది. కాళ్ళు, చేతులు మహా నొప్పులుగా అనిపించి కదల్లేకపోయింది. కానీ మనసులోని ఆనందం ఈ శ్రమ అంతటినీ ఎగర గొట్టేసి, ఏనుగంత బలాన్నిచ్చింది... 'ఆ... ఏముంది?' విమానంలో పడ్డానంటే అంతా విశ్రాంతే. అక్కడకి చేరిపోయాక పని వుండదు. బట్టలుతికేందుకు మిషనట. ఇళ్ళు చీపుళ్ళు పెట్టి తుడుచే పనే వుండదట – ఏదో పిల్లకి సాయంగా, ఇంత గుటగుటలాడిస్తే సరిపోతుంది. అదీ కరెంట్ పొయ్యిమీద' అంటూ సుందరి కూతురి గారింట్లో తనకి లభించబోయే విశ్రాంతిని గురించి ఊహించు కుని, అన్ని పనులు సవ్యంగా పూర్తిచేసి ప్రయాణానికి సిద్ధమైంది. ఇంటి దగ్గర వుండే మూడో కూతురికి వెయ్యి పంపకాలు పెట్టింది. ఇంటరు చదివే కొడుక్కి లక్ష జాగ్రత్తలు చెప్పింది. మొద్దులా దేనికి చలించని మొగుడికి కోటి బాధ్యతలను అప్పగించింది.

❖ ❖ ❖

న్యూయార్క్ ఎయిర్‌పోర్టులోంచి బయటకు వస్తుంటే సుందరికి కళ్ళు తిరిగి పోయాయి. ఆమె పూర్తిగా ప్రపంచం తెలియనిదీ కాదు. అలాగని అన్నీ తెలిసిందీ కాదు.

అల్లుడు రమేష్ వచ్చి ఆమెని తీసుకెళ్తుంటే క్షేమ సమాచారాలు అడుగుతూనే దారిపొడుగునా విశేషాలు చూస్తూ ఆశ్చర్యపోతూనే వుంది.

కొత్తప్రదేశానికి, మన దేశం కాని దేశానికి వెళ్ళినప్పుడు అందరూ బారిష్టరు పార్వతీశాలే అనుకుంది. చీరకొంగు కుచ్చెళ్ళూ బాగా పైకి ఎత్తిపట్టుకుని తను ఎస్కలేటర్ మీద రెండు కాళ్ళు చేర్చిన క్షణం ఎప్పటికీ గుర్తుండిపోతుంది.

న్యూజర్సీలోని కూతురింట్లో అడుగు పెట్టేసరికి, సుందరి వేరే లోకంలోకి వచ్చి పడినట్లనిపించింది.

మల్లిక తల్లి దగ్గర గారాలు పోయింది. సుందరి ఆమెని ముద్దు చేసింది. ఇద్దరూ సుమారు గంటన్నర ఎప్పటెప్పటి కబుర్లో చెప్పుకున్నారు. అల్లుడికి మాగాయి,

కూతురికి పదియాలు ఆ రోజే వడ్డించింది. అన్నం తిని పడుకున్న సుందరి రెండు రోజులు లేవలేకపోయింది. రాత్రేదో, పగలేదో అర్థకాక అయోమయంలో పడిపోయింది.

❖ ❖ ❖

నాలుగోరోజు ఇంటి పనిలో పడింది సుందరి. మల్లిక విశ్రాంతి తీసుకునే కార్యక్రమం చేపట్టింది. విశ్రాంతి అంటే ఫోనులో కబుర్లు, కంప్యూటర్‌లో చాటింగు. విడియోల్లో సినిమాలుగా సర్దుకుంది.

లేచింది మొదలు కాఫీ పెట్టడం దగ్గర్నుంచి, కొత్తకొత్తగా నేర్చుకుంటూ, అనుమానాలు తీర్చుకుంటూ ప్రతి పని అనుకున్నదాని కంటే అరగంట ఆలస్యంగా చేస్తోంది సుందరి. బట్టల మిషన్‌లో వేస్తే ఉతికి, వేడిగా ఆరిపోయాక బయటకొచ్చాయి గానీ అవన్నీ ఇస్త్రీచెయ్యడం పెద్ద పని-

సుందరి గిన్నెలన్నీ డిష్ వాషర్‌లో సర్దేసి అందులో క్లీనింగ్ లోషన్ పోసి "ఆన్" చేసింది గంట తర్వాత ఆవిర్లు కక్కుతున్న సామాను తీసి చూస్తే - ఏముంది? ఒక్కటి శుభ్రంగా లేదు. గుత్తివంకాయ కూర చేసిన మూకుడు - దోసకాయ పప్పు చేసిన స్టీలు గిన్నె - పాలు కాచిన కాదగిన్నె - రైస్ కుక్కర్ గిన్నె - పెరుక్కి వాడిన కప్పు - అన్నీ ఎలా ఉన్నవి అలాగే వున్నాయి.

"ఇదేమిటే మల్లికా" అని దీర్ఘాలు తీసింది. ఆశ్చర్యంతో - కూతురొచ్చి చూసి "అదేమిటే అలా ఉన్నవి ఉన్నట్లు పడేస్తే కుదరదు. మనం శుభ్రంగా తోమి, కడిగి అప్పుడు పెట్టాలి" అంది.

"ఏడిసినట్లే వుంది".

"మరలాగే వుంటుంది - మన వంటలు - నూనెలు - పప్పులు అంతే" అంది.

ఆ రోజునుంచీ సుందరి లేవగానే అంట్ల గిన్నెలు సింకులో వేసుకుని తోమి పెట్టుకోవటం మొదలు పెట్టింది. ఒక ట్యాప్‌లో వేణ్ణీళ్ళు, మరొక దాంట్లోంచి చణ్ణీళ్ళు వేరు వేరుగా వస్తుంటే ఆశ్చర్యంగా ఆనందిస్తూ పని చేసుకునేది.

మన పద్ధతి వంట గిన్నెలు, మూకుళ్ళు, గరిటెలు అన్నీ ప్రత్యేకంగా మనమే శుభ్రంగా తోముకోవాలని అర్థమైంది సుందరికి. అన్నం పట్టుకుపోయిన రైస్‌కుక్కర్ గిన్నె తోమేసరికి ఆయాసం వచ్చేది. బట్టలన్నీ ఇస్త్రీచేసే సరికి జబ్బలు లాగేసేవి.

అల్లుడు ఉదయం ఆరు గంటలకే ఉద్యోగానికి వెళ్ళిపోయేవాడు. పైగా అతను అల్లుడు. మల్లిక రోజు రోజుకి మరీ ఓపలేకుండా ఉంది.

ఇండియాలో ఇంత పనుండదు సుమా అనిపించేది సుందరికి.

నిజమే. పని మనుషులు, బట్టలుతికేవాళ్ళు - ఇస్త్రీ చేసేవాళ్ళూ - ఎక్కడ కావలసినా దొరకుతారు. కాస్త డబ్బు ఖర్చుపెడితే ఆడవాళ్ళు సుఖంగా వుండచ్చు మనదేశంలో.

"ఈ దేశంలో సంపాదన డాలర్లలో ఉన్నా సుఖం పైసల్లో కూడా లేదు" అంది సుందరి ఒకనాడు. దానికి మల్లిక, రమేష్ వెంటనే సమాధానం చెప్పారు. "మేం ఛస్తే ఇండియా రాం" అని.

పదిహేను రోజుల తర్వాత ఎడిసన్‌లో వున్న మరిదిగారబ్బాయి భార్యతో సహా వచ్చి, ఒక పూటంతా వుండి వాళ్ళింటికి రమ్మని మరీ మరీ పిలిచివెళ్ళాడు.

మల్లిక, రమేష్, సుందరీ వస్తామని పదేపదే చెప్పి సాగనంపారు వాళ్ళని.

సుందరికి రకరకాల పనులతో ముఖ్యంగా అలవాటులేని అంట్లగిన్నెల భాగోతంతో అలసట వచ్చేయటం మొదలైంది. మనవాళ్ళు వుండటం అమెరికాలోనైనా వంటలు, వార్పులు మన పద్ధతే కావటంతో కొన్ని కష్టాలు తప్పించుకోలేకపోయింది సుందరి. వారాంతాల్లో కలిసినా పులిహోరలు, బొబ్బట్లు, గారెలు, కజ్జికాయలు అంటూ రుచులు చెప్పుకుంటూ ఇంటి దగ్గరున్నట్లే సంతోషపడుతూ వుంటారు.

పేరంటాలకి, పూజలకీ, వ్రతాలకీ, నోములకీ చక్కగా భార్య, భర్తలు కలిసి వెళ్తారు. భార్యలని శ్రావణ మంగళవారం పేరంటాలకి భర్తలు కారులో మైళ్ళు మైళ్ళు తీసుకెళ్తారు. మన దేశానికి దూరంగా ఉన్నామనే బెంగతో - ఇక్కడివారు మరచిపోయిన ఆచార వ్యవహారాలను తవ్వి తవ్వి మరీ గుర్తుచేసుకుని ఆచరిస్తారు. ఆధునిక భావం అనే మాటంటేనే హడలిపోతారు. సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణ వారి భుజాల మీద వినయంగా వేసుకుని మోస్తుంటారు.

చాలామంది అక్కడ దొరికే ప్రతి వస్తువు ఖరీదుని నలభై పెట్టి గుణించుకుని గుండెలు బాదుకుంటారు. (పై చిల్లర దయగా వదిలేస్తారు)

ఎడిసన్‌లో మరిదిగారబ్బాయింటికి వెళ్ళడానికి రెండు నెలలు పట్టింది. మల్లికకు పురుడొచ్చి మగపిల్లాడు పుట్టాడు. అంతా బాగా జరిగింది. రెండో నెల రాకుండానే పిల్లాడ్ని బ్రిడ్జివాటర్‌లోని వేంకటేశ్వరస్వామి గుడికి తీసుకెళ్ళారు. అటే మరిదిగారబ్బాయి వాళ్ళ ఇంటికీ వెళ్ళారు.

ఆ గుడిని, చుట్టూ వున్న ప్రశాంత వాతావరణాన్నీ, పరిశుభ్రమైన పరిసరాల్నీ చూసి సుందరి ముగ్ధురాలైపోయింది. మనదేశంలో ఎన్నో గుళ్ళూ, గోపురాలు వున్నప్పటికీ, వాటిని చూసినప్పటికీ అన్నింటికంటే గొప్పగా, దర్పంగా కనిపించిందా గుడి. గుళ్ళో దేవుడు సరేసరి. ఎవరికైనా డబ్బుంటే వచ్చే కళే వేరు. గుడి చూశాక, సుందరికి జన్మధన్యమై పోయినట్లుగా అనిపించింది. ఆమెకి గుడి కొత్తకాదు. వెంకటేశ్వరుడూ కొత్తకాదు. అవన్నీ మహాద్భుతాలుగా కనిపించటం కేవలం అమెరికాలో వుండడం వల్లనే–

తిరిగివస్తూ మరిదిగారబ్బాయి ఇంట్లో ఆగి ఆ పిల్ల ఒక్కతీ ఏం వేసుకుంటుం దిలే అని అంటగిన్నెలు తోమినా సుందరికి పెద్దబాధగా అనిపించలేదు.

పదిహేను రోజులకో - నెలకో ఒకసారి మిత్రులింటికో, బంధువులింటికో వెళ్ళడం తప్ప ఇల్లు కదిలే అవకాశం లేదు. మూడు నెలలు దాటేసరికి సుందరికి విసుగ్గా అనిపించింది.

హాయిగా ఆర్.టి.సి. బస్సో, ఆటోనో ఎక్కి తెలిసినవాళ్ళ యింటికి వెళ్ళి కాలక్షేపం చేసి వచ్చే వీలులేదని సుందరి అసంతప్తి పడింది.

మల్లిక పిల్లాడ్ని అమెరికన్ పద్ధతిలో అపూరూపంగా తనే చూసుకుంటోంది.

సుందరి భారతీయ సంప్రదాయం పుణికి పుచ్చుకుని ఇంటి పనులు చేసు కుంటోంది. గుడినుండి తెచ్చుకున్న తులసిమొక్కను అపురూపంగా పెంచి, దాని ముందు ముగ్గు వేసి దీపం పెడుతూ 'శ్రీ తులసీ జయ తులసీ జయము నీయవే' అంటూ పాడుకుంటోంది. 'భరతఖండే - జంబూద్వీపే' అని తనకొచ్చిన విధంగానే పూజలు చేసుకుంటూ మంచి మంచి వంటకాలు, ఘుమఘుమలాడిస్తూ తయారుచేసి నైవేద్యాలు పెట్టి, చిన్నప్పటి రుచులు గుర్తుచేసుకు తినే అల్లుడ్ని చూసి ఆనందిస్తోంది.

పిల్లల కింత చేసి పెట్టడం కంటే మనకేం కావాలి అంటూ సుందరి తృప్తి పొందుతోంది.

మంచిగాలీ, శుభ్రమైన నీరు - మురికి లేని పరిసరాల వల్ల సుందరి మరింత సుందరంగా తయారయ్యింది.

ఆరు నెలలు గడిచి తిరుగు ప్రయాణం రోజున ఆమెకి అనుకున్నంత బాధ కలగలేదని ఆశ్చర్యపోయింది. కూతురు, అల్లుడూ ఆప్యాయంగా వీడ్కోలు చెప్తుంటే 'హమ్మయ్య' అనుకుంది.

తన చేతులు పట్టుకున్న కూతురు – "అమ్మా అంట్లు తోమేటప్పుడు గ్లౌజు వేసుకోమని ఎన్నిసార్లు చెప్పినా విన్నావు కాదు. చూడు గరుగ్గా వున్నాయ్" అంది.

"అలవాటు లేదే" అంది సుందరి.

"చేసుకోవాలే"

సుందరి నవ్వింది – "అమెరికా నాకెలా అలవాటవుతుందే".

విమానం పైకి లేచింది. సుందరి విశ్రాంతిగా వెనక్కివాలింది. 'హమ్మయ్య – ఇంటికెళ్ళగానే అంట్లు తోమాల్సిన పనిలేదు' అనుకుంది.

కదలినా కదలనట్లుంటే విమానం సీట్లో వెనక్కు వాలిన సుందరి కళ్ళ ముందు అమెరికాలో చూసిన సుందర ప్రదేశాలు దృశ్యాలు దృశ్యాలుగా నెమ్మదిగా కదులుతున్నాయి.

('రచన' మాసపత్రిక ఏప్రిల్ 2007)